


# నాన్న-నది

సీతయ్య నాన్న పోయాడు.

సీతయ్య పసివాడేం కాదు. ముప్ఫయైదేళ్ళ వయసులో నలుగురు పిల్లల్ని కన్న సీతయ్యకి నాన్న పోగానే దుఃఖం ముంచుకొచ్చింది. చంటి పిల్లవాడిలా భళ్ళు భళ్ళున ఏడ్చాడు. మంచీ, చెడూ చెప్పుకోవటానికి నాన్న లేడనే భావం వచ్చేసరికి ప్రపంచంలో తను ఒంటరివాడై పోయినట్టనిపించి గుండెల్లో పెద్ద వెలితి, బతుకులో పెద్ద ఖాళీ.

నాన్న లేడు.

నిన్న ఉన్న నాన్న ఇవ్వాళ లేడు. పొద్దున్నే స్నానం చేసి ఉతికిన ధోవతి కట్టుకుని వరండాలో స్తంభానికానుకుని నిత్యమూ పారాయణ చేసుకునే నాన్న లేడు. తను బయటికెళ్తూ 'బజారుకెళ్ళొస్తా నాన్నా' అని చెప్పటానికి నాన్న లేడు. వరండాలో స్తంభం బోసిపోయి దిగాలుగా ఉంది.

ఎప్పటి నాన్న?

చిన్నప్పుడు మూడేళ్ళ వయసులో నాన్న వెల్లకితలా పడుకుని తన్ని గుండెలమీద నుంచో పెట్టుకుని తన చిట్టిచేతులు అంది పుచ్చుకుని 'తారంగం తారంగం

తాండవకృష్ణా తారంగం' అని తన చేత అనిపిస్తూ తను నాన్న గుండెల మీద చిందులు తొక్కుతుంటే సంబరం పడిపోయి మళ్ళీ మళ్ళీ గుండెలమీద తొక్కించుకుంటూ ఆనందంతో కావిలించుకు ముద్దులు పెట్టిన నాన్న మరి లేడు. కొంచెం పెద్దయ్యాక తనతో కృష్ణకి స్నానానికి తీసుకొచ్చి వొడ్డునే కూర్చోపెట్టి వొళ్ళు రుద్ది నీళ్ళు పోసిన నాన్న లేడు. తను ఈత కొడ్తానని పట్టుబడితే నీళ్ళలోకి దింపి నడుముకున్న మొలతాడు చేతపట్టుకుని తాను తప తప చేతుల్తో నీళ్ళలో బాదుతుంటే ఈతలు నేర్పించిన నాన్న లేడు. ఆపైన తెప్పకొయ్యమీద నాన్న ఈదుతుంటే ఆ కొయ్య మీద తనూ పడుకుని కృష్ణ మధ్యలోకి వెళ్ళేవాడు. సుడిగుండంలో సుళ్ళలో ఎలా తిరగాలో, జారులో ఎలా బారలు వెయ్యాలో వడిని ఎలా తప్పుకోవాలో, కృష్ణలో వెల్లకితలా పడుకుని చేతుల్తో ఎలా ఈదాలో దగ్గరుండి నేర్పినవాడు నాన్న.

తన్ని బళ్ళో వేసినప్పుడు కొత్తచొక్కా, కొత్తలాగూ కుట్టించి తోటిపిల్లలకి పప్పు బెల్లాలు పెట్టించి, దగ్గరుండి పంతులుకి అప్పచెప్పి, మధ్యాహ్నమయ్యేసరికి భోజనం కూడా చెయ్యకుండా "పసివాడు ఇంకా రాలేదని"తనకి ఎదురొచ్చి "కాళ్ళు కాల్తాయని" భుజం ఎక్కించుకుని ఇంటికి తీసుకొచ్చేవాడు నాన్న. రాత్రిళ్ళు పక్కలో పడుకోబెట్టుకుని బళ్ళో ఏవేం చెప్పారో తన చేత చెప్పించుకుని, పద్యాలు మళ్ళీ మళ్ళీ పాడించుకుని చిచ్చికొట్టి నిద్రపుచ్చేవాడు. తను ఎదిగాక పొలాలు చూపించి దుక్కిదున్నటం నేర్పి, నాట్లు వేయించి, వ్యవసాయం అప్పగించి 'ఏం ఫర్వాలేదు అన్నీ మావాడు చూసుకుంటాడోయ్' అని గర్వంగా వూరంతా తిరిగి చెప్పుకునేవాడు. పెత్తనం అంతా కొడుక్కి అప్పగించినా సీతయ్య నాన్నముందు పసివాడే. 'ఇవ్వాళ పొలంలో కలుపు తీస్తాం నాన్నా!' 'ఇవ్వాళ కొబ్బరి పచ్చట్లో కారం ఎక్కువయిందికదూ నాన్నా!' అంటూ ప్రతిచిన్న విషయం నాన్నకి చెప్తూ, 'చాకలి నీలిమందు ఎక్కువ పెడ్తున్నాడు నాన్నా' అంటూ నాన్న పంచె సవరించి పాదాలొత్తుతూ మెల్లిగా వేళ్ళు లాగుతూ, ఆప్యాయంగా వొళ్ళంతా నిమురుతూ పసిపిల్లవాడిలా నాన్నని అంటుకుపోయేవాడు సీతయ్య. నాన్న

అన్నీ వినేవాడు. నవ్వుతూ ఊఁ కొట్టేవాడు. అలా ఊఁ కొడ్తుంటే గుండెకు హత్తుకుని ఆశీర్వదిస్తున్నట్లుండేది.

ఇప్పుడెవరు ఊఁ కొడ్తారు?

ఇప్పుడెవరు తల నిమురుతారు?

చుట్టాలెవరో అంటున్నారు 'ఆయన కేవండి? దేవుడు. లక్ష్మీదేవిలాటి కోడల్ని తెచ్చుకున్నాడు. ముగ్గురు మనవల్ని చూశాడు. మనవరాల్ని ఎత్తుకున్నాడు. శ్రీరాముడిలాంటి కొడుక్కి పెత్తనం అప్పగించి నిశ్చింతగా వెళ్ళిపోయాడు. మహారాజు!'

ఈ మాటలు సీతయ్యని ఓదార్చలేక పోతున్నాయి. తను నాన్నలేని వాడయాడు, నాన్న కావాలి! సీతయ్య తల్లి దొడ్లో ఏడ్చి ఏడ్చి పడిపోయింది. తెలివితెచ్చుకుని తులసెమ్మ దగ్గరకెళ్ళి 'అమ్మా! రోజూ నీకు పచ్చగా పసుపురాసి, నిండుగా కుంకం పెట్టి మొక్కుకునేదాన్నే! నా పసుపు కుంకాలు లాగేసుకున్నావా అమ్మా' పుట్టినప్పటినించీ నాముఖం మీద బొట్టు ఉండేదే? ఇలా మోడైపోయిన నా బొట్టులేని ముఖాన్ని నేనే అద్దంలో చూసుకోలేనే? ఇంక నలుగురికి ఎలా చూపిస్తాను?' అంటూ తులసెమ్మ గట్టుమీద పడిపోయింది.

సీతయ్య పిచ్చి చూపులు చూస్తున్నాడు. నాన్నకోసం ఇల్లంతా వెతుక్కుంటూ వున్నాడు. సీతయ్య నలుగురు పిల్లల్ని ఎవరో సముదాయిస్తున్నారు. సీతయ్యకి నాన్న లేకపోతే ఉన్నట్టుండి వయసొచ్చి పెద్దవాడై ముసలితనం వచ్చినట్లయింది. చుట్టాలెవరో "పోయినవాళ్ళు అదృష్టవంతులు. కానివ్వండి, పనులున్నాయి" అని తొందరపెట్టారు.

నాన్న అంత్యక్రియలు పూర్తిచేసి కృష్ణకి స్నానాని కొచ్చాడు సీతయ్య. అదే కృష్ణ! నాన్న · స్నానాలు చేయించిన కృష్ణ! నాన్న ఈతలు కొట్టించిన కృష్ణ, నాన్న మునకలు వేయించిన కృష్ణ "జన్మంతా నీ నీళ్ళు తాగిన నాన్న వెళ్ళి పోయాడమ్మా" "నేను నీ నీళ్ళే తాగి బతుకుతున్నానమ్మా" నాకు నాన్న

కావాలమ్మా అని భోరుమన్నాడు సీతయ్య. సీతయ్య శరీరం కృష్ణ, సీతయ్య ఊపిరి కృష్ణ, సీతయ్య రక్తం కృష్ణ, సీతయ్య ప్రాణం కృష్ణ, సీతయ్య కన్నీళ్లు కృష్ణ, కృష్ణ కృష్ణలో కలిసిపోతోంది. కృష్ణ కృష్ణని అడుగుతోంది నాన్న కావాలని.

కృష్ణ నిండుగా ప్రవహిస్తోంది. సీతయ్య మాటలు వింటూ నిబ్బరంగా సాగిపోతోంది. ఓదార్పుగా సాగిపోతోంది. నిట్టూర్పుగా సాగిపోతోంది. బుజ్జగింపుగా సాగిపోతోంది. కాలం ఆగదన్నట్లు గబగబా వెళ్ళిపోతోంది.

మహా ప్రవాహం సాగి సాగి వెళ్ళిపోతోంది.

నా..... నా..... అంటూ సర సర వెళ్ళిపోతోంది.

సీతయ్య " నాన్నా! నాన్నా" అంటున్నాడు.

కృష్ణ వింటూనే నా ... నా..... అంటూ పరుగెత్తి పోతోంది.

కొత్తనీళ్ళు "నా...... నా...... " అంటూ వస్తున్నాయి.

"నా ..... నా ....." అంటూ కిందకి వెళ్ళిపోతున్నాయి.

మళ్ళీ కొత్త నీళ్ళు "నా ..... ..... నా...... ..... " మళ్ళీ మళ్ళీ కొత్త నీళ్ళు "నా .. నా ...."

వచ్చి వెళ్ళిపోతున్న నీళ్ళు సీతయ్య కేదో చెప్తున్నాయి.

"నాన్నా! నాన్నా" అని విన్పించింది. అది సీతయ్య పిలుపు కాదు. సీతయ్య గొంతుకాదు - ఎవరిగొంతు? ఎవరి పిలుపు?

సీతయ్య రిక్కించి విన్నాడు. ఆ పిలుపు సీతయ్య కొడుకులది.

"నా ... ...నా " అంటూ పరుగెత్తుకొచ్చి అంత పొడుగునా కిందికి వెళ్ళిపోతున్న కృష్ణ చెప్పింది. "పిచ్చి నాన్న నిన్న వెళ్ళిపోయాడు. సహజమే! వెళ్ళిపోయిన నాన్న గురించి బెంబేలు పడుతున్నావు. నువ్వు నీ పిల్లలకి నాన్నవని గుర్తు చేసుకో."కృష్ణ 'నా.... నా' అంటూ రయ్యిమని వచ్చి రయ్యిమని కిందికి వెళ్ళిపోతోంది.*